నినాదం
నిఖార్సైన జర్నలిజం
# సాహితీ లహరి
ఆదివారం 03-05-2026

## సాహిత్య రచనలకు ఆహ్వానం
ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.
sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## కాశీ క్షేత్రం...



సీ.
విశ్వేశ్వరుని సతి వేంచేసి యిచ్చట
    నన్నపూర్ణగ నిలిచి మిన్నగాను
కోరినవారికి కొంగు బంగారమై
    యీడేర్చు కోర్కెల నింపు మీర
నల్పమ్ము నధికమ్ము లాలోచనలు లేక
    వెన్ను దన్నుగనుండి వీడదెపుడు
లోకులకెల్ల తా నాకలి మంటల
    కన్నతల్లిగ తీర్చి కనుల జూచు

తే.గీ.
దర్శనమున కేతెంచిన తప్పకుండ
కడుపు నింపి పంపించును గౌరవముగ
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ద వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812

# నూరేళ్ళ మాలపల్లి


**20వ శతాబ్ది పూర్వార్థంలో తెలుగు సమాజాన్నీ, సాహిత్యాన్నీ ప్రభావితం చేసిన ఉత్తమోత్తమ నవల మాలపల్లి. నవలా సాహిత్యంలోనే హిమగిరి శిఖరం మాలపల్లి. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు జాతీయోద్యమంలో పనిచేసిన వ్యక్తి. ఈ నవలలో నాటి భారతదేశ పరిస్థితులను చక్కగా వివరించారు. ఈ నవలా నిర్మాణానికి తన జీవిత అనుభవాలనే భూమికగా చేసుకున్నరు. సమిష్టి కుటుంబానికి, సంఘ శ్రేయస్సుకు, దళితాభివృద్ధికి కృషి చేశారు. 1922లో వ్యావహారిక భాషలో రాయబడిన నవల మాలపల్లి. ఏ వ్యక్తికైన, పరిపూర్ణమైన మాతృభాషలో ఒక రచన రాయాలంటే సమాజంలో ఉన్న సంస్కృత భాషతోగాని, ఆంగ్ల భాషతో గాని పరిచయం లేని పల్లెటూరి వారితో పరిచయం ఉండాలంటారు ఉన్నవగారు. అప్పుడే అచ్చమైన తెలుగు పదాలు రచనలో కనిపిస్తాయని అతని అభిప్రాయం.**

ఉన్నవ తను చదువుకునే కాలంలో తన పైన ప్రభావం చూపినటువంటి అంశాలను పరిశీలిస్తే సంఘసంస్కర్తల ప్రభావం, రాజకీయ నాయకుల ప్రభావం, అచల సిద్ధాంతం, క్రైస్తవ జీవిత చరిత్ర, మరీ ముఖ్యంగా కందుకూరి వీరేశలింగం పంతులు గారి ప్రభావం కనిపిస్తుంది. అలాగే తిలక్ మార్గం, ఐర్లాండ్లో ఉన్నత విద్య, సహాయ నిరాకరణ, బోల్షివిజం, స్వరాజ్య స్థాపన లాంటి రాజకీయ సంబంధమైన సంఘటనలు కూడా ఉన్నవ జీవితంలో కనిపిస్తాయి. 1902లో గుంటూరులో వీరేశలింగం పంతులుగారి అధ్యక్షతన వితంతు వివాహం మొదటిసారిగా జరిపించారు. వితంతు వివాహాలు జరిపించడం వలన తన కులం వాళ్ళు తనని వెలివేశారు. దాన్ని లెక్క చేయలేదు ఉన్నవ.

గుంటూరులో వితంతు వివాహాలు జరిపించడం వల్ల ఇతనికి 'గుంటూరు వీరేశలింగం' అనే బిరుదు పొందారు. నాడు గాంధీజీ సాగించిన ఉద్యమాలన్నింటిలోనూ క్రియాశీలకంగా పాల్గొన్న వ్యక్తి ఉన్నవ. నాటి జాతీయోద్యమం అనేది ఏ ఒక్క అంశానికి సంబంధించిందో కాదు. 'నాటి సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం అనేక రంగాలకు వ్యాపించి, అనేక ఉద్యమాలుగా సాగి, అవన్నీ జాతియోద్యమంగా పరిణమించడానికి 19 శతాబ్దంలోనే చక్కని అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని, సమాజంలోని కుల, మతాలను రూపుమాపడానికి జాతి మనుగడకు, పురోగతికి, ప్రతిష్టకు నూతన మార్గాన్ని నిర్దేశించినందుకు మహానుభావులనేకులు ముందుకు వచ్చారని, వారిలో రాజరామ్మోహన రాయ్, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, దయానంద సరస్వతి, రవీంద్రుడు, దాదాభాయి నౌరోజీ, గోఖలె మొదలైన వారు ఎందరో ఉన్నారని, వీరందరూ ఒక్కొక్కరు ఒక్కొక్క విధానాన్ని అనుసరించి, జాతీయ ధర్మాన్ని, ఆధ్యాత్మిక జీవితాన్ని నూతన మార్గంలో తీసుకువెళ్లడానికి కృషి చేసిన వారని' అంటారు డా॥ సముద్రాల కృష్ణమాచార్య సామాజిక, సాంస్కృతిక, రాజకీయార్థిక, ఆధ్యాత్మిక రంగాలలో నూతన చైతన్యాన్ని కలిగించి, నవభారత నిర్మాణానికి వీరందరు దోహదం చేశారు. గాంధీజీలో వీరందరి లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నవ పై గాంధీ ద్వారా వీరందరి ప్రభావం పడింది. అందుకే మాలపల్లి నవలలో రామదాసు పాత్ర పూర్తిగా గాంధేయ వాదిలాగే కనిపిస్తుంది. దళితోద్ధరణ, సత్యం, అహింస, మద్యపాన నిషేధం, సామాజిక, సాంస్కృతీకార్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక, నైతిక విలువలతో కూడిన చైతన్యాన్ని నేపథ్యంగా చేసుకొని మాలపల్లి నవలకు కథా వస్తువును ఎంచుకున్నారు ఉన్నవ. మాలపల్లి నవలా రచన కాలం నాటికి దేశంలో ప్రధాన సమస్య స్వాతంత్ర్య ఉద్యమం. నాటి పరిస్థితులు కుల మతాల పేరుతో సమాజంలో వెనుకబడిన వర్గాలను, దళితులను అగ్రవర్ణాలుగా చలామణి అయ్యే వ్యక్తులు, ధనికులు, భూస్వాములు అనేక విధాలుగా దోచుకోవడం కనిపిస్తుంది. మాలపల్లి నవలలోని ప్రతిపాత్రలో ఉన్నవ పరకాయ ప్రవేశం చేశారా అనే విధంగా నవలను రాశారు. ఉన్నవ స్వమతాభిమానం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పట్ల అభిమానం కలవాడు. ఆధ్యాత్మిక భావాలూ, పరమత సహనం కూడా అతనిలో కనిపిస్తుంది. ఉన్నవ నిజజీవితంలో కనిపించే అనేక లక్షణాలు రామదాసు పాత్రలో మనకు దర్శనమిస్తాయి. మాలపల్లి నవల అస్పృశ్యతను ఆధారం చేసుకుని రాయబడింది దీంట్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ, మతపరమైనటువంటి అంశాలు చర్చించబడ్డాయి.

ఈ నవల వెలువడేనాటికి ఇటువంటి కథా వస్తువును లేదా ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని ఏ భారతీయ భాషలలో కూడా నవలలు వెలువడలేదు. 'ది అన్ టచబుల్స్' ముల్కరాజ్ ఆనంద్ గారి నవల కూడా ఈ నవల వెలువడిన పది పన్నెండు ఏళ్ల తరువాతనే వచ్చిందంటారు అక్కిరాజు రమాపతి రావు గారు. ఈ నవలకు అంకురార్పణ నాలుగు గోడల మధ్య కారాగృహంలోనే పుట్టింది. మాలపల్లి నవల సాహితీ చరిత్రలోనే గొప్ప సంచలనం సృష్టించింది. ఎంతోమందిని చైతన్యవంతుల్ని చేసింది. ఇది ఒక నవల మాత్రమే కాదు ఇది ఒక జాతి యొక్క డాక్యుమెంటరీగా వర్ణించవచ్చు. ఆధునిక ఇతిహాస నవలని, కుల నిరసన భావం, కులరహిత సమాజం కావాలని కోరుకునే విధానం, అచల సిద్ధాంతం కూడా ఇందులో కనిపిస్తుంది. మాలపల్లి నవలలో ఆధునిక యుగంలో వచ్చిన, భావ, అభ్యుదయ, విప్లవ, దళిత సాహిత్య ఉద్యమాలకు చారిత్రిక భూమికను అందించిందని, ఈ నవలారచనానంతరం వచ్చిన అనేక సాహిత్య ఉద్యమాలకు ఒక దిక్సూచి. ఈ నవల వచ్చి, నూరేళ్లయిన వన్నె తరగని బంగారంలాగా తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నది. ఈ నవలను సాహిత్య ప్రక్రియ గానే కాకుండా చారిత్రకంగా ఆనాటి సమాజంలో ఉన్న పరిస్థితులకు నిలువుట్టంగా దీనిని భావించాలి. కన్యాశుల్కం తరువాత సంఘసంస్కరణోద్యమంలో భాగంగా వచ్చిన అతి పెద్ద రచన ఇదే ఉండవచ్చునీ నాఅభిప్రాయం. దీని తర్వాత వచ్చిన సంఘసంస్కరణోద్యమ రచనలకు, అస్పృశ్యనిర్మూలనకు వచ్చిన సాహిత్యాలకీనవల స్ఫూర్తినిచ్చింది. రెండు సార్లు బ్రిటీష్ ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది. ఈ నవలలో గాంధేయ మార్గంతోపాటు విప్లవమార్గం ఉంది. అందుకే కాంగ్రెస్ వాళ్లు, కమ్యూనిస్టు వాళ్ళ ఆదరించారు. ఈ నవల మొత్తం సంస్కరణదృష్టితో నడుస్తుంది అంటరా నితనం పై,గాంధేయవాదంపై వచ్చిన మొదటి నవల ఇదేనని, అలాగే దళితుల సమస్యను వస్తువుగా చేసుకొని వచ్చిన తొలిదళిత నవల ఇదేననీ నా అభిప్రాయం. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినందుకు బలైనాడు సంఘదాసు అతను సమాజాన్ని చైతన్యపరిచినాడు, తను జీవించి ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన సంఘ చైతన్యం, తన తదనంతరం లక్ష్యాన్ని నెరవేర్చుకున్నది. వెంకటదాసు తక్కేల్ల జగ్గడుగా మారిన విధానం విప్లవ మార్గంలో నడచిన మార్గం ఇందులో ప్రత్యేకమైంది. ఈ నవల ఇతివృత్త నిర్మాణంలో దళిత వర్గానికి చెందిన రామదాసు కుటుంబం కీలకమైంది.






చదువు ఒక్కటే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందనే విషయాన్ని సంఘదాసు పాత్ర ద్వారా తెలియజేశారు. భూస్వాములు, అగ్రవర్ణాల వారు రైతు కూలీల పట్ల చూపే వివక్షను, ఆ వివక్షను ఎదుర్కోవడం ద్వారా కుటుంబం ఏ విధంగా చితికిపోయిందో, ఉన్నవ వారు మాలపల్లిలో తెలియజేశారు.
ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సమస్యలు వచ్చినా, తాము నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుంది రామదాసు కుటుంబం. దొంగ కేసులు పెట్టి, రామదాసు కుటుంబాన్ని జైలు పాలు చేస్తాడు చౌదరయ్య. జైలులో అనేక సమస్యలు ఎదురు కుంటుంది రామదాసు కుటుంబం.జైలు జీవిత్తాన్ని గడిపిన ఉన్నవ అక్కడి సమస్యలను, ఖైదీల పట్ల వారు వ్యవహారించే తీరు, సెటిల్మెంట్లు, కోర్టులు, పోలీశ్ వ్యవస్థ, శిక్షలు, ధర్మ దోపిడిలు, స్వరాజ్యం, ఆహింసాధర్మం లాంటి అంశాలు మాలపల్లి నవలలో స్థానం పొందాయి. మాలపల్లి నవల కేవలం గత శతాబ్దపు సామాజిక పరిస్థితులకు అద్దం పట్టడమే కాకుండా, రాబోయే తరాలకు ఒక దిక్సూచిగా నిలిచింది. ఒక నవల 30కి పైగా పునర్ముద్రణలు పొందిందంటే, అది సమాజంలోని లోతైన పొరలను ఎంతగా స్పృశించిందో అర్థం చేసుకోవచ్చు. చివరగా చెప్పాలంటే, మాలపల్లి ఒక వర్గానికో, ఒక కాలానికో పరిమితమైన గ్రంథం కాదు. అది తెలుగు జాతి గర్వించదగ్గ ఒక సామాజిక విజ్ఞాన సర్వస్వం. సమాజాన్ని సంఘటితం చేసి, చైతన్య పరిచే ప్రక్రియలో ఈ నవల పోషించిన పాత్ర అజరామరం.

ఆచార్య భూక్య తిరుపతి
తెలుగుశాఖ
హైదరాబాద్
విశ్వవిద్యాలయం
సెల్ : 9441335123



# అక్షరాన్ని ప్రేమిస్తే ఉన్నత శిఖరాలు సాధ్యమే

## కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డా. నందిని సిధారెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడం ఏ రచయిత జీవితంలోనైనా అత్యున్నత గౌరవంగా భావించబడుతుంది. అలాంటి అరుదైన గౌరవాన్ని అందుకున్న ప్రముఖ కవి, గేయరచయిత, తెలంగాణ సాహిత్య స్వరంగా నిలిచిన డా. నందిని సిధారెడ్డి ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అభినందన సభలో చేసిన ప్రసంగం విద్యార్థులు,ఆచార్యులు, అధ్యాపకులు, సాహిత్యాభిమానులను ఎంతగానో ఆలోచింపజేసింది. ఆ ప్రసంగం కేవలం ఒక రచయిత విజయగాథ మాత్రమే కాదు; అది అక్షర శక్తి, సాహిత్య బాధ్యత, గ్రామీణ జీవితం, మానవీయ విలువలు, స్నేహం, తల్లిదండ్రుల ప్రేమ, తెలంగాణ చైతన్యం కలిసిన ఒక జీవన సందేశంగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక అభినందన సభల్లో పాల్గొన్నప్పటికీ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఈ సభ తనకు అత్యంత ఆత్మీయంగా అనిపించిందని నందిని సిధారెడ్డి భావోద్వేగంతో పేర్కొన్నారు. "ఇదే విశ్వవిద్యాలయం నన్ను సాహిత్య దిశగా నడిపించింది. ఇదే నా జీవితాన్ని మార్చిన ప్రదేశం" అని ఆయన గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశలో చదివిన తరగతి గదులు, గ్రంథాలయాలు, సాహిత్య చర్చలు, మిత్రబంధాలు తన వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. తాను డిగ్రీలో గణితశాస్త్రం చదివేవాడినని, కానీ ఆచార్య సి. నారాయణరెడ్డి వద్ద చదవాలనే తపనతో, ఆర్ట్స్ కాలేజీ లో చదవాలని , గణితాన్ని వదిలి సాహిత్యాన్ని ఎంచుకున్నానని ఆయన చెప్పడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది కేవలం కోర్సు మార్పు కాదు; అంతరంగ స్వరాన్ని అనుసరించి తీసుకున్న జీవిత నిర్ణయం.

సినారె తన తొలి కవిత్వాన్ని మెచ్చుకోవడం వల్ల తనలో అపారమైన ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఒక మంచి గురువు విద్యార్థి జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేయగలడో ఈ సంఘటన తెలియజేస్తుంది. గురువు చెప్పే ఒక్క మంచి మాట కూడా విద్యార్థి భవిష్యత్తును మార్చగలదనే విషయాన్ని ఆయన జీవితం నిరూపిస్తుంది. "అక్షరాన్ని ప్రేమించినవారే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు" అనే నందిని సిధారెడ్డి వ్యాఖ్యలో లోతైన జీవన తత్వం దాగి ఉంది. ఆయనకు కవిత్వం కేవలం సాహిత్య ప్రక్రియ కాదు; అది జీవన విధానం. కవిత్వాన్ని ప్రేమించడం అంటే మనిషిని ప్రేమించడం, ప్రకృతిని ప్రేమించడం, సమాజాన్ని అర్థం చేసుకోవడం. నేటి యువత ఎక్కువగా సాంకేతిక ప్రపంచంలో మునిగిపోతున్న సమయంలో పఠన సంస్కృతి తగ్గిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తక పఠనం మనిషిలో ఆలోచనా లోతును పెంచుతుందని, సాహిత్యం మానవీయతను పెంపొందిస్తుందని అన్నారు. జీవితానుభవాలను అక్షరాల్లో మలచుకోవాలని యువతకు సూచించారు. సాహిత్యం కేవలం పరీక్షల కోసం చదివే విషయం కాదని; అది మనిషిని మంచి మనిషిగా తీర్చిదిద్దే శక్తి అని వివరించారు.

తన విద్యార్థి దశలో తరగతి గదిలో అమ్మాయిలు ఉన్నప్పటికీ తాను లౌకిక ఆకర్షణల కంటే కవిత్వం వైపే ఎక్కువగా ఆకర్షితుడినయ్యానని నవ్వుతూ చెప్పడం సభలో చిరునవ్వులు పూయించింది. "కవిత్వమే నా ప్రేమ, అదే నా జీవన భాగస్వామి" అనే ఆయన వ్యాఖ్య ఒక కవి అంతరంగాన్ని ప్రతిబింబించింది. సాహిత్యాన్ని నిజంగా ప్రేమించే రచయిత తన జీవితాన్నే కవిత్వంగా మలచుకుంటాడని ఆయన అభిప్రాయపడ్డారు. రైతు చెమటలో ఒక గేయం, ప్రకృతి నిశ్శబ్దంలో ఒక తాత్వికత, పేదవాడి బాధలో ఒక సామాజిక సత్యం కనిపించడమే కవి దృష్టి అని ఆయన మాటల్లో స్పష్టమైంది. యువతలో పెరుగుతున్న అహంకారాలు, స్వార్థ సంబంధాల గురించి ప్రస్తావిస్తూ, నిజమైన స్నేహంలో ఈగోలు ఉండకూడదని అన్నారు. జీవితంలో డబ్బు, హోదా, అధికారాల కంటే కష్టకాలంలో తోడుగా నిలిచే స్నేహమే గొప్పదని తన అనుభవాల ద్వారా వివరించారు. విద్యార్థి దశలో తనను ఆదుకున్న కందుకూరి శ్రీరాములు, నాళేశ్వరం శంకరం వంటి మిత్రులను జీవితాంతం మరువలేనని పేర్కొన్నారు. వారి స్నేహం కోట్ల రూపాయల సంపద కంటే విలువైనదని అన్నారు. నిజమైన స్నేహం మనిషికి మానసిక బలం ఇస్తుందని, జీవిత పోరాటంలో నిలబడే ధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల ప్రేమ గురించి మాట్లాడుతూ ప్రపంచంలో ఎటువంటి స్వార్థం లేని ప్రేమ తల్లిదండ్రుల ప్రేమేనని అన్నారు. "నాన్నే నా హీరో" అని చెప్పిన సందర్భంలో సభ భావోద్వేగానికి లోనైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లో తండ్రి పంపిన 70 రూపాయలలో 60 రూపాయలు మెస్ ఫీజుకు కట్టి, మిగిలిన 10 రూపాయలతో నెలంతా జీవించేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్నో ఎదురైనా చదువును, సాహిత్యాన్ని వదల్లేదని తెలిపారు. తన తండ్రి జీవితాన్నే ఆధారంగా చేసుకొని "నాగటి తరం" నవలను రచించానని చెప్పారు. తల్లిదండ్రుల త్యాగాలే తన విజయానికి పునాదిగా నిలిచాయని అన్నారు. తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది గ్రామీణ జీవితం, రైతులు, శ్రామికులేనని ఆయన వినమ్రంగా పేర్కొన్నారు. తెలంగాణ పల్లె జీవితం, రైతు చెమట, శ్రామికుల కష్టం తన సాహిత్యానికి మూలధనమని చెప్పారు. తెలంగాణ భాష, జానపద సంస్కృతి, పల్లె భావజాలం ఆయన రచనల్లో సహజంగా కనిపిస్తాయి. అందుకే ఆయన కవిత్వంలో మట్టివాసన ఉంటుంది. ప్రజల జీవితాలను దగ్గరగా చూసిన రచయిత మాత్రమే సమాజానికి దగ్గరైన సాహిత్యాన్ని సృష్టించగలడని ఆయన జీవితం నిరూపిస్తుంది.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన గీతాలు ప్రజల్లో అపారమైన చైతన్యాన్ని నింపాయి. ముఖ్యంగా జై భోలో తెలంగాణ సినిమాలో ఆయన రాసిన "ఒక్క పువ్వు ఒక్క నవ్వు ఉయ్యాలలూగేనా" పాట ఉద్యమ గీతాలలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఉద్యమ సమయంలో కేవలం నినాద గీతాలే కాకుండా ప్రేమ, మానవీయత, భావోద్వేగాలను ప్రతిబింబించే పాటలు కూడా రాయవచ్చని ఆయన నిరూపించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆయన కేవలం రాజకీయ పోరాటంగా కాకుండా సాంస్కృతిక చైతన్యంగా చూశారు. ఆయన పాటలు ప్రజల హృదయాల్లో ఆత్మగౌరవాన్ని నింపాయి. కవిత్వంలో "లవ్ ఫెయిల్యూర్" అనే పదానికి స్థానం లేదని పేర్కొంటూ, నిజమైన కవి ఏ భావాన్నైనా పదాల్లో మలచగలడని చెప్పారు. టూ కంట్రీస్ సినిమాలో సునీల్ కోసం రాసిన "చెలియా..." పాటను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, కవిత్వాన్ని ప్రేమించే రచయితకు భావవ్యక్తీకరణలో ఎలాంటి పరిమితులు ఉండవని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందించిన "అనిమేష" కావ్యం గురించి ప్రత్యేకంగా మాట్లాడిన నందిని సిధారెడ్డి, కరోనా లాక్‌డౌన్ సమయంలో ఈ కావ్యాన్ని పూర్తి చేశానని తెలిపారు. కరోనా కాలంలో మనుషులు అనుభవించిన ఒంటరితనం, బాధ, ప్రకృతి-మనిషి సంబంధం వంటి అనుభూతులు "అనిమేష"లో ప్రతిబింబించాయని వివరించారు. ఈ రచనను ముందుగా కవి కె. శివారెడ్డి గారికి, అనంతరం నాళేశ్వరం శంకరం గారికి వినిపించానని చెప్పారు. "అనిమేష" తన అంతర్ముఖ అనుభూతుల నుంచి పుట్టిన కావ్యమని పేర్కొంటూ, కవిత్వం ఎప్పుడూ పురస్కారాల కోసం రాయకూడదని అన్నారు. సమాజం పట్ల బాధ్యతతో రాసిన రచనలకే చిరస్థాయి గుర్తింపు లభిస్తుందని యువ రచయితలకు సూచించారు. ఈ సందర్భంగా ప్రపంచ తెలుగు మహాసభల అనుభవాలను ప్రస్తావిస్తూ, కే. చంద్రశేఖర్ రావు తెలుగు భాషా సాహిత్యాల విలువను అర్థం చేసుకున్న దూరదృష్టి కలిగిన నాయకుడని నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. ఒకప్పుడు మూడున్నర రూపాయల బస్సు ఛార్జీ లేక తొలి తెలుగు మహాసభలను కూడా చూడలేకపోయిన నేను, తర్వాత యాభై కోట్ల రూపాయల వ్యయంతో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించే బాధ్యతను చేపట్టడం తన జీవితంలో అక్షర శక్తి సాధించిన గొప్ప విజయమని భావోద్వేగంతో చెప్పారు. ఆ మహాసభలు కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, తెలుగు భాష గౌరవాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టిన సాంస్కృతిక యజ్ఞమని అన్నారు. ఆ బాధ్యత తనకు అప్పగించినప్పుడు "నేను చేయగలనా?" అనే సందేహం కలిగిందని, కానీ "ప్రేమతో చేసే పని ఎందుకు సాధ్యం కాకూడదు?" అనే నమ్మకమే తనకు ధైర్యం ఇచ్చిందని చెప్పారు. మహాసభల నిర్వహణలో ఇతర



ప్రాంతీయులు సలహాలు ఇస్తామని చెప్పినా వారి సూచనల పై ఆధారపడకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగానని తెలిపారు. ప్రపంచంలోని 42 దేశాల నుంచి, 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి, తెలుగు భాషా వైభవాన్ని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశామని చెప్పారు.
ఆ సభల విజయాన్ని చూసిన తర్వాత కేసీఆర్ గారు "ఈ సభల వల్ల వెయ్యి కోట్లు ఖర్చు పెట్టినా రాని కీర్తి వచ్చింది" అని చెప్పిన మాట తనకు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో ఆ మహాసభలు తన జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయాయని అన్నారు. "నేను అక్షరాన్ని ప్రేమించాను. కవిత్వాన్ని ప్రేమించాను. పనిని ప్రేమించాను. కానీ డబ్బును ప్రేమించలేదు. అధికారాన్ని ప్రేమించలేదు" అనే ఆయన మాటల్లోనే వ్యక్తిత్వ గొప్పతనం ప్రతిఫలించింది. ప్రేమతో, అంకితభావంతో చేసిన పని శాశ్వత కీర్తిని తెస్తుందని ప్రపంచ తెలుగు మహాసభల విజయమే నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు.

నందిని సిధారెడ్డి ప్రసంగం కేవలం ఒక సాహితీవేత్త జ్ఞాపకాల సమాహారం కాదు; అది ఒక జీవన పాఠం. అక్షరంపై ప్రేమ, గురువుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల త్యాగం, స్నేహం, గ్రామీణ జీవితం, తెలంగాణ చైతన్యం, సాహిత్య బాధ్యత ఆయన మాటల్లో అద్భుతంగా మిళితమయ్యాయి. ముఖ్యంగా "అక్షరాన్ని ప్రేమిస్తే ఉన్నత శిఖరాలు సాధ్యమే" అనే ఆయన సందేశం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది. డబ్బు, హోదాలు, అధికారాల కంటే అక్షర ప్రేమ గొప్పదని, సాహిత్యం మనిషిని మరింత మానవీయంగా తీర్చిదిద్దుతుందని ఆయన జీవితం స్పష్టంగా తెలియజేస్తుంది. అక్షరాన్ని ప్రేమించిన సాధారణ విద్యార్థి, తెలంగాణ ఆత్మను అక్షరాల్లో మలిచిన మహాకవిగా ఎదగగలడని డా. నందిని సిధారెడ్డి జీవితం నిరూపించిన సజీవ సత్యంగా నిలిచిపోయింది.

- డా.ఇడికోజు శ్రీనివాసాచారి
తెలుగు అధ్యాపకులు
9885349305



## ఈ యుగం నాది

యుగయుగాలుగా చాందససంకెళ్ళను తెంచుకొని
నరనరానా స్వేచ్ఛా భావాలు నింపుకొని
పదండి ముందుకు పదండి తోసుకొని
అదిగదిగో వస్తున్నాయి వస్తున్నాయి
జగన్నాథరథచక్రాలొస్తున్నాయన్నాడు
కుక్కపిల్ల సబ్బుబిళ్ళ అగ్గిపుల్ల అన్నీ
కవితా వస్తువులని కాదేది కవిత్వమకనర్హమని చాటాడు
వయసులు మళ్ళిన సోమరులారా చావండి
అదోజగత్ సహోదరులు కోసం పాటుపడమన్నాడు
ఎడవకండేడవకండి పతితులారాభ్రష్టు లారా
ఏడవకండాన్నాడు
చందోరీతులతో పాటు చందస్సు లేని
వచనకవితారీతులను
రచించాడు
గర్జించాడు రష్యా గాండ్రిచురష్యాయని గొంతెత్తి అరిచాడు
నవయుగ వైతాళికుడై నవ్యపథానికి దారులు చూపాడు
శ్రీ శ్రీ అంటే ఒకడుకాదిద్దరని గర్వంగా పలికాడు
కవిత్వమంటె తీరనిదాహమని ఎలుగెత్తి చాటాడు
మీరే మీరే భాగ్యవిధాతలని బోధించాడు
నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి
ఆహుతిస్తానన్నాడు
ఏదేశచరిత్రచూసినా ఏముంది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీఢనా పరాయణత్వమే
అదిగదిగో మహాప్రస్థానం అందరూ చేరుకోవాలన్నాడు.

- దోసపాటి వేంకట రామచంద్ర రావు
విజయనగరం


## నరహరీ శరణు

సీ.
శ్రీహరీ! శరణన్న శీఘ్రముగావచ్చి
    ప్రహ్లాదుగాచిన పరమపురుష!
దాస్యవిముక్తికై తపమునొనర్చిన
    ధ్రువునిగాచినయట్టి దురితహరుడ!
గజరాజు దీనుడై కమలాక్ష యనివేడ
    రక్షించి బ్రోచిన లచ్చిమగడ!
యాపదలోనున్న ద్రౌపది మ్రొక్కగా
    మానంబు కాచిన మహిధరుండ!

తే.గీ.
జగతిఁ నడిపించు సర్వేశ చక్రధారి!
దీనజనుల వెన్నుండెడి దీనబంధు!
కలిత యాదాద్రిరూప లక్ష్మయ్య పోష!
కృపను జూపు నృసింహ మోకిలనివాస!



- రఘుపాత్రుని. సాయిశివ
బ్రాహ్మణతర్లా గ్రామము, శ్రీకాకుళం జిల్లా.



జీవితంలో ఎదురయ్యే కష్టాలు మన ప్రయాణాన్ని ఆపలేవని తన జీవితం ద్వారా నిరూపించిన వ్యక్తి *డా. అట్టెం దత్తయ్య.* చిన్నతనంలోనే చదువు ఆపేసి మేకల కాపరిగా మారిన ఆయన, విద్యపై ఆసక్తితో, స్వయంకృషితో తిరిగి ఉన్నత విద్యావంతుడయ్యారు. బ్రతుకు పోరాటంలో ఆటుపోట్లు, కష్టజీవితం నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం, పట్టుదలతో, విరామమెరుగని కృషితో సాగి చివరకు పరిశోధన రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. ఇప్పుడు ఆయన ఢిల్లీవిశ్వవిద్యాలయం ఎస్వీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ, ఎందరో విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. వ్యక్తిగతంగా ఎదగడం మాత్రమే కాకుండా, సమాజంలోని అణగారిన వర్గాల స్వరాన్ని సాహిత్యం ద్వారా వెలుగులోకి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా బీసీ సాహిత్యంపై ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్యంలో కొత్త దిశను చూపించింది. వృత్తి ఆధారిత సంస్కృతులు, భాష, జీవన అనుభవాలను సాహిత్యంలో ప్రతిబింబింపజేస్తున్న ఆయన ప్రయత్నం విశేషమైనది. ఈ ఇంటర్వ్యూలో ఆయన జీవన ప్రయాణం నుంచి సాహిత్య దృక్పథం వరకు ఎన్నో ఆలోచింపజేసే అంశాలు మన ముందుకు తీసుకు వస్తున్న

'నినాదం' సాహితీ లహరి ప్రత్యేక ప్రతినిధి డి. సాయినాథ్ రెడ్డి చేసిన ప్రత్యేక సంభాషణ...





# నాడు మేకల కాపరి నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్

## బిసివాద సాహిత్య అస్తిత్వ గొంతుక డా. అట్టెం దత్తయ్య

**(నినాదం): చిన్నప్పుడు చదువు ఆపేసి గొర్రెలను మేపేవారని తెలిసింది? అటువంటి సమయంలో మరలా చదువుకోవాలని ఎందుకు అనిపించింది?**

ఏడవ తరగతి వరకే నేను పాఠశాలకు వెళ్ళి చదువుకున్నాను. ఆ తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులవల్ల నేను మేకల కాపరిగా మారాల్సి వచ్చింది. మాకు కొన్ని మేకలుండేవి. వ్యవసాయంతో పాటుమేకలు కూడా మాకు అప్పుడు ప్రధాన జీవనాధారం. అట్లా మేకల కాపరిగా ఏనిమిది సంవత్సరాల జీవితం గడిపాను. తర్వాత నా చిన్ననాటి క్లాస్ మెట్ ఇఫ్తేకార్ సలహాతో ప్రైవేట్ 10వ తరగతి పరీక్ష ఫీ కట్టాను. మా బంధువు మఠం కాశీరాం అతని పాత పుస్తకాలు, గైడ్స్ అన్ని ఇచ్చాడు. చదివాను. పాస్ అయ్యాను.

**(నినాదం): ఆ సమయంలో చదువుకోవడానికి సహాయం చేసింది ఎవరు?**

గణితం, ఆంగ్లం తప్ప మిగిలినవి అన్ని సబ్జెక్టులు నేను చదువుకుంటున్నాను. ఆ రెండు సబ్జెక్టులకోసం మా మండలం లింగంపేటలో ఉండే రత్నాకర్ సార్ దగ్గరకు వెళ్ళి నా పరిస్థితి అంతా చెప్పాను. నాకు ట్యూషన్ చెప్పాలి అని బతిమిలాడాను. అంగీకరించారు. ప్రతి రోజు రాత్రి 7 తర్వాత మా ఊరికి చిన్న టి.వి.ఎస్. షాంపూ మీద వచ్చి నాకు గణితం, ఆంగ్లం నేర్పించారు. ఏడు వరకు నేను మేకలను దొడ్డిలో తోలి సిద్ధంగా ఉండే వాడిని. అప్పుడు చెప్పడం మొదలుపెట్టేవారు. చాలా సార్లు నాతోనే అక్కడే పడుకునే వారు. అలా రాత్రి అని కూడా చూడకుండా నాకు కష్టపడి ప్రేమతో నేర్పించారు. ఇష్టంతో బాగా నేర్చుకున్నాను.

**(నినాదం): అప్పటికీ మీ వయసు ఎంతా? మళ్ళీ ఎప్పటి నుండి రెగ్యూలర్‌గా చదివారు?**

నేను తిరిగి చదవడం మొదలు పెట్టినప్పుడు నా వయసు 19 సంవత్సరాలు దాటింది. 2003లో నేను 10వ తరగతి పాస్ అయ్యాను. ఇంటర్ కూడా రెగ్యూలర్ గా వెళ్ళి చదవలేదు. యూసూఫ్ సార్ సహకారంతో హెచ్.ఇ.సి. గ్రూప్ తీసుకుని మేకల వెంట ఉంటూనే చదివాను. కాని ఆ కళాశాలలో పాస్ అయినా అతి తక్కువ మందిలో నేను ఒకడిని. డిగ్రీ నుండి రెగ్యూలర్ గా చదివాను. అది కూడా పొద్దంతా పనిచేసుకుంటూ నైట్ కాలేజీ, పి.వి.వి. ఓరియంటల్ కామారెడ్డిలో చదివాను. మంచి మార్కులతో పాస్ అయి టీచర్ ట్రేయినింగ్ పూర్తి చేసుకున్నాను. అనంతరం ఉస్మానియా క్యాంపస్ లో ఎం.ఏ.లో చేరాను. అక్కడే ఆచార్య సాగి కమలాకర శర్మగారి పర్యవేక్షణలో పిహెచ్.డి. పూర్తి చేసుకున్నాను. మధ్యలో తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య వై.రెడ్డి శ్యామల గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్.చేసాను.

**(నినాదం): దూర విద్యా విధానానికి, ప్రత్యక్ష విద్య అభ్యసన విధానానికి మధ్యగల భేదాలను అనుభవ పూర్వకంగా గమనించారు కదా! ప్రస్తుత విద్యా విధానానికి ఏ పద్ధతి మంచిదనుకుంటున్నారు? ఎందువల్ల?**

జ. ప్రత్యక్ష విద్యనే మంచిది. కాని మాలాంటి వారికి దూరవిద్య చాలా మేలు చేసింది. ప్రత్యక్ష విద్య అభ్యసించే వారిని తీసిపోని విద్యను అందించింది. దూరవిద్యలో చదువుకున్న వారు చాలా రంగాలలో చెప్పుకోదగ్గ స్థానాలలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

**(నినాదం):కవిత్వం, కథలు కూడా రాశారు కదా... పరిశోధనలోకి వచ్చాక సృజనాత్మక సాహిత్యం రాయడం తగ్గించడానికి కారణం ఏమిటి?**

జ. సృజనాత్మక సాహిత్యం రాయడం తగ్గించడానికి కారణాలు ఏమి లేవు. కాని పరిశోధనలో మునిగిన తర్వాత సృజన సాహిత్యం వైపు సమయాన్ని కేటాయించడం తగ్గిపోతుంది. రెండింటిని సమానంగా రాయడం కొంతవరకు అసాధ్యమైన విషయమే. కాని నేను ఎదిగి వచ్చిన జీవితం నన్ను ఎప్పుడు సృజనాత్మక సాహిత్యం వైపు లాగుతుంది. నేను ఎదగాల్సి జీవితం నన్ను పరిశోధన సాహిత్యం వైపు లాగుతుంది.

**(నినాదం):పరిశోధనలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమీలతో కలిసి పని చేసిన సాహిత్య కృషిని వివరించండి.?**

జ. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పరిశోధక విద్యార్థిగా ఉన్నకాలంలో ఉస్మానియా శతాబ్ది ఉత్సవాలు మొదలయ్యాయి. అప్పుడు తెలుగుశాఖ అధ్యక్షులుగా గౌరవనీయ ఆచార్య సూర్యాధనంజయ్ మేడం ఉన్నారు. నిరంతరం సాహితీ కార్యక్రమాలు జరుగుతూనే ఉండేవి. అందులో మా అందరిని భాగస్వాములను చేసారు. **'తెలంగాణ సాహిత్యం - సమాలోచనం', 'శతవాసంతిక', 'గురుతరం'** వంటి గొప్పగొప్ప పుస్తకాలకు సహాయసంపాదకుడిగా పనిచేసే అవకాశం కలిగింది.

నేను తెలంగాణ సాహిత్య అకాడెమితో కలిసి చేసిన పనులలో **'తెలంగాణ సాహిత్య గ్రంథ సూచి'** చాలా సంతృప్తినిచ్చింది. తెలంగాణ నుండి ముద్రితమైన 16వేల సాహిత్య గ్రంథాలను (2017వరకు) పూర్తి వివరాలతో సూచీని తయారు చేసి అందించాం. దీనికి మూలకారణం అంతా ఆనాటి తెలంగాణ సాహిత్య అకాడెమి చైర్మన్ డా. నందిని సిధారెడ్డి గారు. గ్రంథసూచీ నిర్మాణంలో గౌరవనీయ ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారి మార్గనిర్దేశం కీలకమైనది. నాతో పాటు ఇంకా ముగ్గురు పనిచేసారు. మొత్తానికి అది పెద్ద పుస్తకంగా ఈ మధ్య కాలంలో డా. బాలాచారి గారు ముద్రించారు. అట్లాగే తొలి మూడు సంవత్సరాల అకాడెమి ప్రయాణాన్ని ఒక పుస్తకంగా రాసాను. అది త్వరలో వస్తుంది.

**(నినాదం): ఈ మధ్యకాలంలో బీసీ సాహిత్యంపై విస్తృతంగా రచనలు వెలువరిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఈ సాహిత్యాన్ని తీసుకురావడంలోని మీ లక్ష్యం?**

బీసీ సాహిత్యం అంటే వృత్తి సాహిత్యం. ప్రతి బీసీ కులానికి ఒక ప్రత్యేక వృత్తి ఉంది. ఆ వృత్తికి సంబంధించిన విశేషమైన పదజాలం ఉంది, పండగలున్నాయి. సంస్కృతులున్నాయి. అదే స్థాయిలో లాభనష్టాలున్నాయి. వాటిని నమ్ముకుని సమాజానికి ఉపయోగపడ్డ వారెందరో వారి జీవితాలను కోల్పోయారు. వారి జీవితాలు ఆధిపత్య పీడనకు గురయ్యాయి, గురవుతూనే ఉన్నాయి. ఈ గోడు ఎంత రాసిన ఇంకా మిగిలే ఉంటుంది. ఇప్పుడిప్పుడే వారివారి కులం పేరు, వృత్తిపేరు పెట్టుకుని రాస్తున్నారు. ఆ రచనల వల్ల భాషనుండి బతుకు వరకు అధ్యయనం చేసే అవకాశం కనిపించింది. ఆ కోణంలో పనిచేస్తున్న. ఇంతకాలం తెలుగు ప్రధాన సాహిత్యం వాటిని సరిగ్గా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ చర్చ చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు అదే ప్రధాన సాహిత్యంగా మారబోతుంది ముందుముందు.

**(నినాదం): మీరు వెలువరించిన బీసీ సాహిత్యం గురించి తెలియజేయండి.?**

నేను 2021లో **'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం'** అనే గ్రంథాన్ని తీసుకువచ్చాను. ఇది మంచి గుర్తింపును ఇచ్చింది. అప్పటికి నేను ఉస్మానియాలో పరిశోధక విద్యార్థిని. ఆ పుస్తకం రాసినప్పటి నుండి బీసీల మీద వచ్చిన కథలను, కవిత్వాన్ని, పాటను కులాల వారిగా వేరు చేస్తూ పెట్టాను. వాటన్నిటిని ఇప్పుడు పుస్తకాలుగా తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నాను. అందులో భాగమే **'మోకు' (గౌడుల బతుకు తాళ్లు), 'వాము' (కుమ్మ రుల బతుకు చక్రాలు), 'రేవు' (రజకుల బతుకు మూటలు), 'రుంజ' (పంచదా యీల బతుకు ధ్వనులు)** ఈ నాలుగు కథా సంకలనాలు. అన్నింటిలో 20 కథల చొప్పున ఎంపిక చేసాము. త్వరలో ఇంకా 8 బీసీకథా సంకలనాలు, బీసీకవిత, బీసీపాట పేర్లతో రెండు సంకలనాలు సిద్ధం అవుతున్నాయి. ఇదంతా ధ్రువ ఫౌండేషన్ సహకారంతో చేస్తున్నాము.

**(నినాదం): బీసీ సాహిత్యం ఏ యే వృత్తులపై ఎక్కువగా వచ్చింది?**

అక్షరాస్యత ఎక్కువ ఉన్న బీసీ వృత్తుల మీదనే ఎక్కవగా వచ్చింది. పద్మశాలీలు, పంచదాయిలు, గౌడ, యాదవులు వంటివారి వృత్తులకు సంబంధించిన సాహిత్యం ఎక్కువగా వచ్చింది. ఇప్పుడిప్పుడే వారిని గురించి, వారి వృత్తులను గురించి రాసుకుంటున్న బీసీ కులాలున్నాయి. అన్ని బీసీ కులాలకు ఆశ్రిత కులాలున్నాయి. ఈ ఆశ్రిత కులాల వారు వారికి సంబంధించిన కులాల జీవితాలను, నాయకులను, వీరులను, సంస్కృతులను గానం చేస్తారు. అవన్ని రికార్డు కావాల్సిన అవసరం ఉంది. అప్పుడు అసలైన బీసీ సాహిత్యం కొంత వరకు బయటకు వస్తుంది.

**(నినాదం):తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోను, దేశవ్యాప్తంగాను బీసీలకు మధ్య వృత్తులలో వైవిధ్యాలు ఉన్నాయి. వీటిని ఎలా అర్థం చేసుకోవాలి?**

ప్రాంతీయ చరిత్ర, సంస్కృతి ప్రభావాలు, భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు, సంప్రదాయ కులవృత్తులు - ఆధునిక మార్పులు, ఆర్థిక అవకాశాలు, సామాజిక పరిస్థితులు, మార్కెట్ ప్రభావాలు, ఆయా ప్రభుత్వ విధానాలు, రిజర్వేషన్లు, వలసలు మొదలగు అంశాల కోణంలో దేశంలో గల బీసీవృత్తులను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

**(నినాదం): కొన్ని వృత్తులు చేయడం అనేది ఆధునిక కాలంలో అన్ని కులాల వారు చేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని వృత్తులనేవి కొంత మంది అస్తిత్వాన్ని తెలిపేవిగా మాత్రమే గుర్తింపు తెచ్చుకున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వృత్తులను బట్టి ఆ వృతులు చేసేవారు అంతా బీసీలుగా గుర్తించవచ్చా?**

బీసీలుగా గుర్తించడానికి వృత్తి ఒక్కటే ప్రధాన అంశం కాదు. వారి సామాజిక స్థితి, విద్యాపరమైన వెనుకబాటు, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ పాతినిధ్యం మొదలగు వాటన్నిటితో ముడిపడి ఉంటుంది.

**(నినాదం):ప్రస్తుతం బీసీ సాహిత్యంలో ఏఏ ప్రక్రియల్లో రచనలు వెలువడుతున్నాయి?**

ప్రధాన స్రవంతిలో ఉన్న అన్ని ప్రక్రియలలో రచనలు వస్తున్నాయి. నేను 2021లో తీసుకొచ్చిన 'బి.సి.వాద సాహిత్యం' పుస్తకంలో బీసీల మీద వచ్చిన పద్యం, పాట, కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ అనే ఏడు ప్రక్రియలలో రాసిన సాహిత్యాన్ని పరిశీలించాను. అనంతరం బీసీల మీద వచ్చిన నానీలు, బీసీల మీద వచ్చిన మొగ్గలు వంటివాటిని కూడా సేకరించి పెట్టాను. త్వరలో రానున్న 'తెలంగాణ బి.సి.వాద సాహిత్యం' పుస్తకం పునర్ముద్రణలో వాటిని కూడా చేర్చబోతున్నాను.

**(నినాదం):బీసీ సాహిత్యంపై జరుగుతున్న పరిశోధనల పట్ల మీ అభిప్రాయం?**

జ. బీసీ సాహిత్యం మీద పరిశోధనలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయని చెప్పుకోవాలి. ఇంకా విస్తృతంగా రావల్సిన అవసరం ఉంది. వస్తాయి కూడా.

**(నినాదం): రాజ్యాధికార లక్ష్యంలో బీసీసాహితీ వేత్తల లక్ష్యం ఎలా ఉంటే బాగుంటుందని మీ అభిప్రాయం?**

జ. సాహిత్యం ప్రజల్లో అవగాహన పెంచే సాధనం. బీసీ వర్గాల చరిత్ర, పోరాటాలు, సాధించిన విజయాలు మరింత ప్రతిబింబిచేలా ఉండాలి. అణగారిన వర్గాల స్వరాలను మరింత బలంగా వినిపించేలా ఉండాలి. రచనలు భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాకుండా, అసమానతలను బలంగా ప్రశ్నించేలా ఉండాలి. సమాన అవకాశాల కోసం ఆలోచనలు రేకెత్తించేలా ఉండాలి. బీసీవర్గాలలో ఉన్న విభజనలు తగ్గించి, ఐక్యతను మరింత ప్రోత్సహించేలా రచనలు రావాలి. బీసీ వర్గాల సంస్కృతి, వృత్తులు, సంప్రదాయాలపై గౌరవాన్ని పెంచుతూ, హీన భావనను తొలగించి, స్వాభిమానాన్ని బలపరచే రచనలు కూడా రావాలని నా భావన.

**(నినాదం):దళితులు, గిరిజనులు, మైనారిటీ వాద సాహిత్యాలపట్ల బి.సి. సాహిత్య దృక్పథం?**

జ. వీరందరి సాహిత్య లక్ష్యం ఒకటే. అణచివేత, అసమానతలను ప్రశ్నించి సమానత్వం సాధించడం. వీరందరికి ఒకరి పట్ల మరొకరికి సహానుభూతి, ఐక్యత ఉండాలి. అందరూ కలిసి ఐక్యంగా పూలే, అంబేద్కర్ దృక్పథంతో అధిపత్యాలకు వ్యతిరేకంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

**(నినాదం): బహుజన సాహిత్యం అంటే మీ అభిప్రాయం ఏమిటి?**

బీసీ, దళిత, మైనారిటీ, గిరిజన, సబ్బండ కులాల జీవితాలను ఎత్తిపడుతూ, తరతరాలుగా అణిచివేతను ఎదుర్కుంటున్న వారి విముక్తికి చైతన్యాన్ని అందించేదే బహుజన సాహిత్యం.

**(నినాదం):బీసీలకు కులపరమైన వివక్ష ఉందని మీరు భావిస్తున్నారా? ఆ దిశగా ఎలాంటి సాహిత్యం వచ్చింది?**


ఒకటి రెండు కులాలు మినహాయిస్తే అన్ని కులాల వారు వివక్షను ఎదుర్కుంటున్నారు. ఆ దిశగా చాలా సాహిత్యం వచ్చింది. ముఖ్యంగా సంచార కులాల వారు, ఆశ్రిత కులాల వారు. ఉదాహరణకు భిక్షుకకుంట్ల వారు. ఇట్లాంటి బీసీ కులాల మీద సాహిత్యం వచ్చింది. పరిశోధనలు కూడా జరుగుతున్నాయి.

**(నినాదం): బీసీ సాహిత్యానికి, బహుజన సాహిత్యానికి మధ్య గల భేద సాదృశ్యాలు?**

బీసీ సాహిత్యం కూడా బహుజన సాహిత్యం గొడుగుకింది నుండి వచ్చినదే. బహుజన చైతన్యం కోసం సమష్టిగా కృషి చేస్తూనే, వ్యక్తిగత అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం గొంతు విప్పాల్సిన సమాజంలో ఉన్నాము. కనుక దళిత, మైనారిటీ, గిరిజన, బీసీ సాహిత్యాలు విడివిడిగా రావాల్సిన అనివార్యత ఏర్పడింది. అట్లా అయితేనే సకల జనుల జీవితం, సమస్యలు సంపూర్ణంగా వ్యక్తమైతాయి. అంతే తప్ప బీసీ సాహిత్యానికి, బహుజన సాహిత్యానికి మధ్య భేద సాదృశ్యాలు వేరుగా ఉండవు. మనం చూడాల్సిన అవసరం కూడా అంతగా లేదని నా అభిప్రాయం.



ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అట్టెం దత్తయ్య గారిని ఇంటర్వ్యూ చేస్తున్న నినాదం ప్రత్యేక ప్రతినిధి డి. సాయినాథ్ రెడ్డి...



నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 3-05-2026

సాహిత్య రచనలకు ఆహ్వానం
ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.
sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# నేను... అమ్మ గర్భం నుండే పుట్టాను!




నేను కూడా
ఈ విశ్వంలోని ప్రతి ప్రాణిలాగే,
సహజంగా, సంతోషంగా,
అమ్మ గర్భం నుండే పుట్టాను.
ఒక మానవుడిగా,
కేవలం ఒక మామూలు మానవుడిగా
నేనెవరి తల నుండో పుట్టలేదు
నేనెవరి భుజాల నుండో పుట్టలేదు
నేనెవరి తొడల నుండో పుట్టలేదు
నేనేవరి పాదాల నుండో పుట్టలేదు
ప్రకృతి నుండే జ్ఞానం
పరిసరాలనుండే జ్ఞానం
అవసరాలు సృష్టించిన అనుభవం నుండే జ్ఞానం
జ్ఞానం నా సొంతం కాదనెలా చెప్తాను?

నేను
కేవలం అమ్మ గర్భం నుండే పుట్టాను.
ఆమె రక్తాన్ని, ఆమె మాంసాల్ని,
ఆమె ప్రేమనీ, ఆమె వేదననీ పంచుకొని
ఒక ప్రాణంగా రూపుదిద్దుకున్నాను
నా పుట్టుకలో ఏ మంత్రం లేదు,
ఏ తంత్రం లేదు,
ఏ కులం లేదు, ఏ వర్గం లేదు.
నేను మాత్రమే
ఈ భూమిని పాటించడానికి పుట్టలేదు
ప్రేమాప్యాయతలు అమ్మానాన్నల వారసత్వం
బాధ్యతలెవరో ఏర్పరిచినవి కాదు
నా కుటుంబ సుఖదుఃఖాల నుండి పుట్టుకొచ్చినవి
నేనొక అధికారాన్ని కాదు
నేనొక అనురాగాల పందిరిని మాత్రమే!

నేను అవసరాల్ని వ్యాపారం చేయాలని
నేనెక్కడినుండో రాలేదు
బలహీనతల్ని వ్యాపారం చేయాలని
నాకెవరూ ఏ వాణిజ్య సూత్రాల్నీ నేర్పించి పంపించలేదు
జీవితం నేర్పిన పాఠాల్లో
పరస్పర సహకారంలో
పరస్పర అవసరాల్లో
పొదుపునీ నేర్చుకున్నాం.
ఇచ్చిపుచ్చుకోవడమూ నేర్చుకున్నాం
అవసరాల్ని అనేక మార్గాల్లో తీర్చుకున్నాం
ఒకరిపై మరొకరి దోపిడీకోసం
తొడల నుంచి పుట్టి వ్యాపారం కాదిది!
ఇది పరస్పర సహకార అనుభవ సూత్రం!

నేను సేవ చేయడానికే రాలేదు
సేవ చేయడమే నా తలరాతని
నా నుదుటిపై ఎవ్వరూ రాయలేదు
పనుల నైపుణ్యంలో
పరిసరా శుభ్రతలో
పరస్పర సహజీవనంలో
ఒక్కొక్కరిదొకో పని!

ఏదీ శాశ్వతం కాదు
ఏదీ శిలా శాసనం కాదు
ఏదీ దైవ నిర్దేశం అసలే కాదు!
పసిపిల్లల్ని
మలమూత్రాల నుండి శుభ్రం చేసిచ్చిన
అమ్మెంత పరమ పూజ్యురాలు?
సమాజాన్ని పవిత్రం చేసే 'సేవ' కూడా పరమ
పూజ్యనీయమే!
పవిత్రత-అపవిత్రతలన్నీ
మనిషి మనసులో నింపుకున్న
శాశ్వతంగా ప్రవహించే మలిన రక్త స్వభావం!



మనకు మనం నింపుకుని ప్రవహింపజేసుకునే
మురిగినీటి బాంధవ్యాలు!
సేవ తలరాత కాదు
సేవ పాదాల నుండి పుట్టలేదు
సమాజ కల్యాణం నుండి పుట్టింది!

నేను... అమ్మ గర్భం నుండే పుట్టాను.
ఆమె గుండె చప్పుడులో
నాకు సమానత్వ సంగీతమే వినిపించింది.
ఆమె పాలలో
నాకు స్వేచ్ఛనే రుచి చూపించింది.
ఆమె కళ్ళలో
నాకు ఆత్మగౌరవమే కనిపించింది.
నన్ను సేకుడను
నన్ను శ్రామికుడను
నన్ను దళితుడను
నన్ను వృత్త కళాకారుడను
నన్ను నువ్వేమని పిలిచినా,
నేనీ దేశ మూలవాసిని
నేనీ సింధునాగరికతను
ఈ మట్టి సాక్షిగా, ఈ ఆకాశం సాక్షిగా,
నా పుట్టుకలోని సహజత్వాన్ని,
నా మానవత్వాన్నే చాటిచెబుతున్నాను.
నేను అమ్మ గర్భం నుండే పుట్టాను!
నేనే మహాపురుషుని దేహ భాగాల నుండీ పుట్టలేదు!

నేనే మహాపురుషుని పాదాల నీడలో
చుక్కలా జారిన వాడిని కాదు
నా జననం
ఏ దేహ భాగం కథలోని ఉపమానం కాదు
నా శ్వాస
ఏ శాస్త్రపు శ్లోకానికి బంధువు కాదు
నేను పుట్టింది
ఒక మానవ దేహం పడే నొప్పి నుండి
ఒక తల్లిదండ్రుల ప్రేమ నుండీ!

ఈ విభజన ఎక్కడి నుంచొచ్చింది?
అది కథల్లో పుట్టింది
అది భయాల్లో పెరిగింది
అది అధికారం కోసం నిలబడింది
సత్యం మాత్రం
అనుభవంలో ఉంటుంది
సత్యం మాత్రం నిశ్శబ్దంలో వినిపిస్తుంది
నన్ను కథలలో కట్టేశారు
నా జీవితం వాళ్ళ పురాణం కాదు
నా పేరు
ఏ దేహ భాగానికీ బంధీ కాదు
నా ఆత్మ
నా శరీరంలోనే పుట్టింది
నేను
మానవుడి నుండే పుట్టాను
అదే నా సత్యం
అదే నా గర్వం
అదే నా గళం
అదే నా ఆత్మగౌరవం!

నేను
పాదాల దుమ్మును కాదు
అగ్నికణాన్ని!

నేను
వేదం కాదు, పాదం కాదు
తల కాదు, తొడకాదు
నేనొక మానవుణ్ణి
నేనొక నిలువెత్తు మానవత్వాన్ని!



***
నేను ప్రకృతినొక తల్లిగా భావించాను
శిలలతో తలపడ్డాను.. శిల్పాన్ని చేసింది
కరువుతో పోరాడాను.. కడలిలా పొంగింది
నా ఆకలి తీర్చమని
పకృతిని వేడుతూ గాయపరిచాను
ఆ గాయం నుండి తీపి ఫలాన్ని ప్రసాదించింది
కారుచీకటి అడవుల్లో దారి తప్పాను
మిణుగురు వెలుగై చేయి పట్టుకుని నడిపింది
ఎర్రని ఎండలో నిలువెల్లా కాలిపోయాను
నీలి మేఘమై నా మీద దయచూపింది
నేను సంధించిన బాణాని
విలువకట్టి తన గుండెనే బహుమతిగా ఇచ్చింది
తడారిన గొంతుతో ఆకాశాన్ని మొక్కాను
కురిపించిన వానతో నా దాహం తీర్చింది
నా అన్వేషణ అంతా ప్రకృతిపై ఆధిపత్యం
కోసమే నేమో అనుకున్నాను
అది అపారమైన ప్రేమను తెలుసుకోవడం కోసం
అమ్మలా నాలోని శక్తిని బయటకు తీసింది
ప్రకృతి ఓ గర్జించే మేఘమవుతుంది..
ప్రకృతి లాలించే సమీరమవుతంంది
నా అజ్ఞానపు అరుపులను భరించే
మౌన గంభీరమవుతుంది
అమ్మా... ప్రకృతి మాతా....
మట్టివి..
నువ్వే ఆకాశానివి
చివరకు నేను కలిసిపోయే నీ శాశ్వత గర్భానివి.
నేను గెలిచానని గర్వపడ్డ ప్రతిసారీ
ఓడిన బిడ్డను తల్లి హత్తుకున్నట్టు హత్తుకున్నావు
నువ్వు కేవలం ప్రకృతివి కావు....
నా ఉనికిని కాపాడే ఏకైక దృశ్య దైవానివి!

***
చరిత్ర గాయాల నుండి పుట్టిన
నేనొక ధిక్కార స్వరాన్ని
సత్యాన్వేషణలో నేనొక భౌతిక సత్యాన్ని!
నా కళ్లలో కదలాడే కలలు
ఏ ఆకాశపు దేవతల దయాభిక్షా కావు
గాలిని పీల్చే నా ఊపిరితిత్తులు
ఏ దేవతలకూ తలవంచవు.
ఈ గాలి నా పూర్వీకుల శ్వాస
ఈ నేల నా తాతముత్తాతల వారసత్వంగా ప్రవహించిన రక్తం క్షేత్రం!
నా నరాల్లో ప్రవహించే ఎర్రని లావా
మీ వర్ణాల సంకెళ్లను కరిగించే అగ్నిధార
నా పాదముద్రలు
ఈ నేల మీద అపవిత్రపు చారలు కావు
బీడు భూమిని పులకింపజేసే వర్షపు జల్లులు!
నా చెమట చుక్కలు రాలితేనే
నేల తలవంచి ధాన్యపు గింజలను ప్రసవిస్తుంది.
నేను పంజరంలో చిక్కుకున్న పక్షిని కాను
శిఖరాలను తాకే నిలువెత్తు ఆత్మగౌరవాన్ని
రాళ్లను పిండి చేసే శ్రమ శక్తిని
నేను మనిషిని... కేవలం మనిషిని!
నేను మీరు పిలిచే ఆది
మానవుడ్ని!
నేను మీరు పిలిచే శ్రామికుడ్ని!
నేను మీరు పిలిచే గిరిజనుడ్ని!
నేను మీరు పిలిచే దళితుడ్ని!
నేను మీరు పిలిచే
బహుజనుడ్ని!
నేను మనిషిని...
నేను కేవలం మనిషిని!!

- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049



నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 3-05-2026

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

### పుస్తకాలకు అందని జీవితం - పుస్తక రూపం దాల్చిన వేదన

# ఆకుపచ్చని దేశం

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ "నేనిక లేనని తెలిశాక విషాదాశ్రులను వర్షిస్తాయి నీ కళ్ళు.. కానీ నేస్తం అది నా కంటపడదు!/ ఆ విలాపమేదో ఇప్పుడే నా సమక్షంలోనే...అంటూనే 'సానుభూతి తెలపడానికి నా ఇంటి వైపు అడుగులు వేస్తావ్.../నా మరణ వార్త విన్నాక!/ సంవత్స రాలుగా మనం ఏం మాట్లాడుకున్నామని?/ ఇప్పుడే నా వైపు చూడు, నాతో మాట్లాడు, బదులు పలుకు వస్తుంది" పలికిన ఈ హృదయ విదారకమైన మాటలు, ప్రపంచ సాహిత్య పంక్తులలో మానవ సంబంధాల లోతును చాటిచెప్పే అక్షర సత్యాలు. ఈ అక్షర గుచ్ఛం డా. వి. చంద్రశేఖర రావు గారు రచించిన 'ఆకుపచ్చని దేశం' (ఆకుపచ్చని గాయం) నవలకు నూటికి నూరు పాళ్ళు అద్దం పడుతుంది. అభివృద్ధి పేరిట ముంపునకు గురవుతున్న అడవిని, ఆ అడవిని విడిచి రావడానికి ఇష్టపడని చెంచుల ఆత్మాభిమానాన్ని వస్తువుగా చేసుకున్న తీరు అద్భుతం. అడవి నుండి బయటకు వస్తే తమ ఉనికినే కోల్పోతామన్న భయంతో వారు అనుభవించిన నరకయాతనను, ఆకలి చావులను చిత్రిస్తూనే...చదువుకున్న ఒక చెంచు యువకుడి (వీర) అంతర్మథనాన్ని ప్రధాన భూమికగా చేసి ఈ నవలను మలచిన తీరు పాఠకుల హృదయాలను కదిలిస్తుంది. వ్యవస్థల సానుభూతి కోసం వేచి చూడకుండా, తమ అస్తిత్వం కోసం వారు సాగించిన ఈ పోరాటం ప్రతి అక్షరంలోనూ తడి ఆరని వేదనగా కనిపిస్తుంది.

డా. వి. చంద్రశేఖర రావు గారు 2012లో వెలువరించిన 'ఆకుపచ్చని దేశం' నవల, సామాజిక వాస్తవికతకు అద్దం పట్టే ఒక గొప్ప సృజన. చంద్రశేఖర రావు గారు నిరంతరం వర్తమాన స్పృహతో కలం పట్టే అరుదైన కథకుడు. వర్తమానానికి పునాది అయిన భూతకాలాన్ని లోతుగా విశ్లేషిస్తూనే, దాని గర్భం నుండి ఉద్భవించే భవిష్యత్తు పరిణామాలను సైతం అద్భుతంగా దర్శించగల దార్శనికత ఆయన సొంతం. కాల ప్రవాహంలో కొట్టుకుపోకుండా, సమకాలీన సమాజంలోని వైరుధ్యాలను, మానవీయ కోణాలను పట్టుకుంటూ ఆయన రాసే కథలు ఎప్పుడూ వర్తమానపు వేడిని, వేదనను ప్రతిబింబిస్తూనే ఉంటాయి. సమకాలీన తెలుగు సాహిత్య ప్రపంచం పై చెరగని సంతకం చేసిన లబ్ధప్రతిష్ఠులైన రచయిత డా. వి.చంద్రశేఖర రావు గారు. 'ఐదు హంసలు', 'నల్లమిరియపు చెట్టు' వంటి సుప్రసిద్ధ నవలల ద్వారా సామాజిక వాస్తవికతను ఆవిష్కరించిన ఆయన, కథా సాహిత్యంలోనూ తన ప్రతిభను చాటారు. 'జీవని', 'లెనిన్ ప్లేస్', 'మాయా లాంతరు', 'ద్రోహవృక్షం' వంటి కథల ద్వారా మానవ సంబంధాలలోని సంక్లిష్టతలను, సమకాలీన సమాజంలోని వైరుధ్యాలను అత్యంత లోతుగా చిత్రించారు. వస్తు వైవిధ్యం, శిల్ప నైపుణ్యం కలగలిసిన వీరి రచనలు తెలుగు పాఠక లోకానికి ఒక నూతన దృక్పథాన్ని అందించాయి. కథా, నవలా ప్రక్రియల్లో సమానమైన పట్టు సాధించిన చంద్రశేఖర రావు గారు, తన అక్షర సంపదతో తెలుగు సాహిత్యానికి ఎనలేని వన్నె తెచ్చిన గొప్ప సృజనశీలి. అక్షరాన్ని ఆయుధంగా మలచి, కాలంతో పాటు ప్రయాణించే ఆయన శైలి ఈ నవలలో మరింత పరిణతితో ఆవిష్కృతమైంది. గాయపడిన 'ఆకుపచ్చని దేశం' లోకి తొంగి చూద్దాం: డా. వి. చంద్రశేఖర రావు గారు రచించిన 'ఆకుపచ్చని దేశం' నవల రెండు విభాగాలుగా ఉంటుంది. అందులో మొదటది 'ఆకుపచ్చని గాయం', రెండోవది 'నల్ల మిరియం గింజలు'. ఆధునిక అభివృద్ధి పేరిట ఆదిమ తెగల అస్తిత్వం ఏ విధంగా ఛిద్రమవుతుందో విశ్లేషించే ఒక గొప్ప సామాజిక దస్తావేజు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదివిన 'వీర' అనే చెంచు యువకుడి అంతర్మథనం, అతని సామాజిక ప్రయాణం ఈ నవలకు వెన్నెముక. బాల్యంలో ఆకలి చావుల నుండి తప్పించడానికి తల్లి అడవికి ఆవల వదిలేసిన వీర, విద్యావంతుడై సమాజంలో గౌరవం పొందినా, అతని మూలాలు మాత్రం నల్లమల అడవుల్లోనే నిక్షిప్తమై ఉంటాయి. స్త్రీవాద కార్యకర్త 'మోహిని'తో సాన్నిహిత్యం, వివాహం అతని జీవితంలో కొత్త మలుపులు తెచ్చినా, చెంచుల 'పునరావాసం' కోసం ఆమె అతన్ని అడవికి పంపడం వెనుక మానవతా దృక్పథంతో పాటు ఎన్జీవోల ఆర్థిక ప్రయోజనాలు కూడా దాగి ఉండటం వ్యవస్థలోని వైరుధ్యాన్ని సూచిస్తుంది.


వీర తన బాల్యం నాటి 'ఆకుపచ్చని దేశాన్ని' చూడాలని తపనతో అడవిలోకి అడుగుపెడతాడు కానీ, అక్కడ అతనికి ఎదురైన దృశ్యం అత్యంత భీభత్సమైనది. నాగరిక ప్రపంచానికి ఆమడ దూరంలో, ఆకలితో అలమటిస్తూ, మలేరియా, టీబీ వంటి వ్యాధులతో అస్థిపంజరాల్లా మారిన తన వారిని చూసి వీర హృదయం ద్రవిస్తుంది. అడవికి రాజులమని చెప్పుకునే చెంచులకు 'ముఖ్యమంత్రి' అంటే ఎవరో తెలియని స్థితి, వారి అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందే 'అలల సుందరం' వంటి నాయకుల కుట్రలు నవలలో అద్భుతంగా చిత్రించబడ్డాయి. అభివృద్ధి పేరిట వచ్చే 'వెలిగొండ ప్రాజెక్టు' వల్ల చెంచులు తమ ప్రాణప్రదమైన అడవిని వదిలి వెళ్లాల్సి రావడం, వారి సంస్కృతిని, వేర్లను నరుక్కోవడ మేనన్న పెదమంతయ్య ఆవేదన పాఠకుడిని ఆలోచింపజేస్తుంది. నవల ముగింపు దశకు చేరుకునే సరికి, ప్రభుత్వ అణచివేత, పోలీసుల దాడులు, ఆకలి మరణాల మధ్య చెంచు జాతి మౌనంగా రోదిస్తుంది. వీరపై జరిగిన భౌతిక దాడులు కేవలం ఒక వ్యక్తిపై జరిగినవి కావు, అది ఒక తెగ ఆశలపై జరిగిన దాడి. అయినా సరే, అడవిని వదలడానికి ఇష్టపడని చెంచులు తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేస్తారు. చివరిలో బయ్యన్న అనే పాత్ర ద్వారా లభించే 'నల్ల మిరియం గింజలు' కేవలం విత్తనాలు కావు, అవి ఆ జాతి పట్టుదలకు, భవిష్యత్తుపై ఉన్న ఆశకు, మళ్ళీ అడవిలో చిగురించబోయే జీవనానికి సంకేతాలు. వీర ఆ మిరియాలను జేబులో వేసుకోవడం ద్వారా తన విద్యను, తన మూలాలను అనుసంధానం చేస్తూ, ఆకలి లేని, ఆత్మగౌరవం ఉన్న ఆకుపచ్చని లోకం కోసం పోరాటాన్ని కొనసాగించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేస్తాడు. ఈ నవల అభివృద్ధి నమూనాలను ప్రశ్నిస్తూనే, మానవీయ సంబంధాలలోని సంక్లిష్టతలను అత్యంత కళాత్మకంగా ఆవిష్కరించింది.

**అస్తిత్వ పోరాటం మరియు నిర్వాసిత వేదన:**

ఈ నవలలో ప్రధానాంశం 'అభివృద్ధి' అనే ముసుగులో జరుగుతున్న అమానవీయ విధ్వంసం. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తరతరాలుగా అడవినే ప్రాణంగా నమ్ముకున్న చెంచులు తమ మూలాలను, అస్తిత్వాన్ని కోల్పోవాల్సి రావడం ఇక్కడ గుండెను మెలిపెట్టే సమస్య. వారి దృష్టిలో అడవిని వదలడం అంటే కేవలం నివాసం మారడం కాదు, అది "కాళ్లు నరుక్కోవడంతో సమానం". అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు, ఆకాశహర్మ్యాలు కాదని, మనుషుల జీవనవిధానాన్ని, వారి సంస్కృతిని గౌరవించడమే అసలైన వికాసమని రచయిత ఇక్కడ లోతుగా విశ్లేషించారు. నవల ప్రారంభంలో కథానాయకుడు 'వీర' చెంచులను ఆధునిక లోకంలోకి తీసుకురావాలనే తపనతో గూడేనికి వస్తాడు. "చెంచు తెగ మనుగడ సాగించాలంటే నాగరికులతో కలవక తప్పదు" అని బలంగా నమ్మిన వీర... కొద్దిరోజుల్లోనే ఆధునిక సమాజంలోని కృత్రిమత్వాన్ని, స్వార్థాన్ని గమనించి విస్తుపోతాడు. విజ్ఞానంతో నాగరికులైపోయామని భావించే మన సమాజంపై రచయిత ఒక సంక్లిష్టమైన ప్రశ్నను సంధిస్తారు. "అన్ని పుస్తకాలు, అన్ని పాఠాలు నా చెంచు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఎందుకు ఉపయోగపడలేదు?" అన్న వీర ఆవేదన ఈ వ్యవస్థా లోపానికి నిలువుటద్దం.

కొన్ని జీవితాలు పుస్తకాల పరిధికి ఆవల, సిద్ధాంతాలకు అతీతంగా సాగుతుంటాయి. ఆ జీవితాలను రాజకీయ కోణంలోనో, నగరవాసుల మేధోదృష్టితోనో చూస్తే అర్థం కావు. వాటిని అర్థం చేసుకో వాలంటే వారిలో ఒకరిగా మారి, వారి శ్వాసను పంచుకోవాలి. యూని వర్సిటీ నుండి నేరుగా గూడాలకు వచ్చిన వీర, మొదట్లో వారి జీవనశైలిని నాగరిక సమాజంతో పోల్చుకోని చూసిన... వారితో కలిసి నడిచి, కలిసి తిని, కలిసి జీవించాక అసలు సత్యాన్ని గ్రహిస్తాడు. ఆ క్రమంలో ఏర్పడిన ఆలోచనా వ్యత్యాసం వల్లే, చివరకు తన భార్య మోహినిని కూడా వదులుకుని అడవి బాట పడతాడు. ఈ సున్నితత్వాన్ని అర్థం చేసుకోలేని ఆధునిక సమాజం, చెంచులను 'అనాగరికులు'గా ముద్ర వేయడం మనం నిర్మించుకున్న ఇనుప సరిహద్దులకు నిదర్శనం. ఈ నవలలో ప్రధానంగా రెండు భిన్నమైన, శక్తివంతమైన కోణాలు ఆవిష్కృతమయ్యాయి. ఒకటి, తరతరాలుగా ప్రకృతి ఒడిలో మమేకమై జీవిస్తున్న గిరిజన దృక్పథం కాగా, రెండవది, ఆ అస్తిత్వం కోసం 'వీర', 'పెదమంతయ్య'లు సాగించిన అలుపెరగని సమరశీలిత. అడవిని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి వారు జరిపిన ఈ సుదీర్ఘ ప్రయాణం ఒక 'లాంగ్ మార్చ్' లాంటిది. ఒక కలను వాస్తవ రూపంలోకి ఎలా మలచుకోవాలో, ఒక పోరాట నిర్మాణాన్ని ఎలా నిర్మించాలో ఈ నవల ఒక గొప్ప మార్గదర్శిలా ధ్వనిస్తుంది. ఇది కేవలం పుస్తకం కాదు, అణచివేతకు వ్యతిరేకంగా వినిపించే ఒక మహోన్నత శబ్ద తరంగం. నాగరికత వర్సెస్ ఆదిమ సంస్కృతి విశ్వవిద్యాలయంలో చదువుకున్న వీర, అడవిలోని పెదమంతయ్య వంటి పాత్రల మధ్య ఉన్న వ్యత్యాసం నాగరికతకు, ప్రకృతికి మధ్య ఉన్న దూరాన్ని చూపుతుంది. వీర పుస్తక జ్ఞానం తన జాతి ఆకలిని, ఆవేదనను అర్థం చేసుకోవడానికి సరిపోలేదని గ్రహించడం ఒక కీలకమైన సామాజిక విశ్లేషణ. నాగరిక సమాజం ఆదిమ తెగలను కేవలం 'ఓట్లు'గా లేదా 'నిధుల వనరులు'గా చూస్తుందే తప్ప, వారిని మనుషులుగా గుర్తించకపోవడాన్ని రచయిత ఎత్తిచూపారు. అందుకే రచయిత చాలా సందర్భాల్లో వీర చేత అనేక నూతన కోణాలను ఆవిష్కరింపజేస్తాడు. అలాగే 'మోహిని' పాత్ర ద్వారా స్వచ్ఛంద సంస్థల పనితీరులోని లోపాలను రచయిత స్పృశించారు. గిరిజన హక్కుల కోసం పనిచేస్తున్నామని చెబుతూనే, విదేశీ నిధుల కోసం (10 లక్షల లాభం వంటి అంశాలు) వారిని బలవంతంగా పునరావాసానికి తరలించాల నుకోవడం వ్యవస్థలోని ద్వంద్వ నీతిని వెల్లడిస్తుంది. మానవతా దృక్పథం కంటే సంస్థాగత లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్న తీరు ఇక్కడ విశ్లేషించబడింది.

ఆకలి సామాజిక వివక్షఈ నవలలో 'ఆకలి' కేవలం ఒక శారీరక అవసరం కాదు, అది ఒక సజీవ పాత్రలా పాఠకుడిని వెంటాడుతుంది. అంకయ్య, అంకాలమ్మల మరణాలు కాలం చేసిన సహజ ముగింపులు కావు, అవి ఆకలి పేరిట ఈ వ్యవస్థ చేసిన నిశ్శబ్ద హత్యలు. వారం పొడవునా పస్తులుండటం, గత్యంతరం లేక విషపు పుట్టగొడుగులు తిని ప్రాణాలు వదలడం వంటి సంఘటనలు 'మెరుస్తున్న భారతం' ముసుగులోని చీకటి కోణాన్ని నగ్నంగా ఆవిష్కరిస్తాయి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల వైఫల్యాన్ని ఇవి నిలదీస్తాయి. తాను కలలుగన్న 'కల్మషం అంటని ఆకుపచ్చని దేశం' కాదిదని, ఇది వందల ఏళ్ల ఆకలితో అలమటిస్తున్న ఆర్త భూమి అని వీర గ్రహించినప్పుడు కలిగే వేదన వర్ణనాతీతం. "రెండు గంజి మెతుకులు ఈ శతాబ్దాల ఆకలిని ఎలా తీర్చగలవు?" అన్న అతని అంతర్మథనం పాఠకుడి గుండెను మెలిపెడుతుంది. రోజుల తరబడి ఆహారం లేకుండా జీవించగలిగే శక్తి ఆ తెగకు ఉందంటే, అది వారి గొప్పతనం కాదు, వారిపై రుద్దబడిన దౌర్భాగ్యం. నవల పొడవునా ప్రతి అడుగులోనూ ఆకలి చావుల నిర్వేదమే కనిపిస్తుంది. నవల ముగింపులో, "బతకడం .కష్టమైపోయింది సార్" అని ధైర్యంగా ప్రశ్నించాలనుకున్న గొంతుకలు సామాజిక వివక్ష ధాటికి మూగబోవడం విషాదకరం. ఆ దట్టమైన అడవుల్లో సైతం వారిని నీడలా వెంటాడే సామాజిక అంటరానితనం, వారి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది. అందుకే 50 మందితో మొదలైన ప్రయాణం చివరకు 43 మందికే పరిమితమవుతుంది. "తెలివితక్కువ మనిషీ! నీ కాలం ముగిసింది.. నిన్ను ధ్వంసం చేయడానికి వచ్చాను" అని ఆధునిక మానవుడు పలికే మాటలు, ప్రకృతిని మరియు ప్రకృతి బిడ్డలను మింగేస్తున్న అభివృద్ధి రాక్షసత్వానికి నిదర్శనాలు. ఈ నవల అక్షరరూపం దాల్చిన ఒక సామాజిక గాయం.




**ఆకుపచ్చని ఆశ - రేపటి పోరాటానికి సంకేతం:**

చివరగా చెప్పాలంటే, 'ఆకుపచ్చని దేశం' కేవలం ఒక తెగ నిర్వాసిత గాథ మాత్రమే కాదు, అది ఆధునిక నాగరికత ముసుగులో జరుగుతున్న అమానవీయ విధ్వంసంపై సంధించిన అక్షరాయుధం. అభివృద్ధి పేరిట మనిషికి, ప్రకృతికి మధ్య మనం నిర్మించుకున్న ఇనుప గోడలను ఈ నవల బద్దలు కొడుతుంది.ఉస్మానియా మేధోతనం నుండి అడవి మూలాల్లోకి ప్రయాణించిన 'వీర' పాత్ర ద్వారా, పుస్తక జ్ఞానం కంటే జీవన విలువే గొప్పదని రచయిత నిరూపించారు. నవల చివరలో వీర తన జేబులో వేసుకున్న 'నల్ల మిరియం గింజలు' వినాశనం అంచున ఉన్న ఒక జాతి ఆత్మగౌరవానికి, తిరుగుబాటుకు మరియు పునరుజ్జీవనానికి సజీవ సాక్ష్యాలు. అడవిని, ఉనికిని కోల్పోతున్న వేళ ఆ గింజలు పట్టుదలగా మొలకెత్తి, ఆకలి లేని... వివక్ష లేని... ఒక కొత్త 'ఆకుపచ్చని దేశాన్ని' నిర్మిస్తాయనే ఆశను పాఠకుడి గుండెల్లో నాటుతూ ఈ నవల ఒక గొప్ప సామాజిక పరివర్తనగా నిలిచిపోతుంది. ఇది కేవలం ఒక అంతం కాదు, అణచివేతపై అక్షరం సాధించిన విజయం.ఈ నవల చివరికి 'మౌన భాష' గురించి మాట్లాడుతుంది. ఆహారాన్ని ముట్టకుండా, మాటలు రాకుండా కేవలం అడవి వైపు చూసే చెంచుల మౌనం సభ్య సమాజాన్ని ప్రశ్నిస్తుంది. వీర తన చదువును పక్కన పెట్టి, తన జాతి మూలాలతో మమేకం అవ్వడం ద్వారా చదువు యొక్క అంతిమ లక్ష్యం సమాజ శ్రేయస్సేనని రచయిత సందేశాన్ని ఇచ్చారు. గాయపడిన ఆకుపచ్చని దేశం నుండి తడి ఆరని ఆ వేదనను తుడిచివేస్తూ, వివక్ష లేని సరికొత్త మానవీయ సమాజం వైపు చెంచులను భాగస్వాములను చేస్తూ కలిసి అడుగులు వేద్దాం. వారి అస్తిత్వాన్ని గౌరవిస్తూ, ఆ ఆదిమ మూలాల నుండి ఆధునిక ప్రగతి వైపు సాగే ఈ ఆకుపచ్చని ప్రయాణంలో మనమూ భాగమవుదాం రండి!

డా. జరుపుల రమేష్,
అసోసియేట్ ప్రొఫెసర్,
కాకతీయ ప్రభుత్వ కళాశాల,
హనుమకొండ. 9618944654



# అధికారం పన్నిన 'పద్మవ్యూహం'

**సమాజంలోని అట్టడుగు వర్గాల నిస్సహాయతను అలుసుగా తీసుకొని ఉన్నత వర్గం చేసే దోపిడీని ఎంతో హృదయ విదారకంగా చిత్రించిన కథే భూషణం గారి 'పద్మవ్యూహం'. పేదవాడి అవసరాన్ని ఆసరాగా తీసుకుని ధనిక వర్గ వ్యక్తి చేసిన అమానుష గాథే ఈ కథలోని వస్తువు'. పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లు ఎంత లోతుగా ఉంటాయో అనడానికి ఈ కథ మరొక ఉదాహరణ. 'కథానికకు శిల్పమే ప్రాణం' అని శీలా వీర్రాజు అంటాడు. ఆ శిల్పం ఈ 'పద్మవ్యూహం' కథను రచయిత భూషణం చాలా అనుభవంతో నేర్పుగా చెక్కారు.**

'భూషణం గారు రచించిన 'పద్మవ్యూహం' కథ సామాన్యుడి అమాయకత్వాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా బలితీసుకుంటుందో కళ్లకు కడుతుంది. నిండు గర్భిణి అయిన తన భార్య సత్తికి ఒక కొత్త చీర కొనాలనే చిన్న కోరికతో, వెంకటి అనే పేదవాడు నాయుడు పన్నే కుట్రలో చిక్కుకుంటాడు. సారా బస్తాలు రవాణా చేస్తూ పోలీసులకు చిక్కి జైలుపాలైన వెంకటి, తనను ఇరికించింది తన యజమాని నాయుడే అని ఆలస్యంగా గ్రహిస్తాడు. శిక్ష ముగిసి ఇంటికి వచ్చేసరికి సత్తి మరణించిందని, కామాంధుడైన నాయుడే ఆమె చావుకు కారణమని తెలుసుకున్న వెంకటి, ఆ పద్మవ్యూహం నుండి బయటపడి పగ తీర్చుకోవడంతో కథ ముగుస్తుంది. అల్పాక్షరాలలో అనల్పార్థం వచ్చేలా, ఒక సామాన్యుడి జీవితంలోని విషాదాన్ని రచయిత ఇందులో అత్యంత శక్తివంతంగా చిత్రించారు.

భూషణం గారు రచించిన 'పద్మవ్యూహం' కథ పేదరికంలోని అమాయకత్వాన్ని పెట్టుబడిదారీ శక్తులు తమ స్వార్థం కోసం ఎలా బలితీసుకుంటాయో హృదయవిదారకంగా చూపిస్తుంది. నిండు గర్భిణి అయిన భార్య సత్తికి ఒక కొత్త చీర కొనాలనే చిన్న కోరికతో, వెంకటి అనే పేదవాడు నాయుడు పన్నే కుట్రలో చిక్కుకుంటాడు. సారా బస్తాలు రవాణా చేస్తూ పోలీసులకు చిక్కి జైలుపాలైన వెంకటి, తనను ఇరికించింది తన యజమాని నాయుడే అని, దొంగ సారా కేసుల ఒప్పందంలో భాగంగా తానొక పావుగా మారానని ఆలస్యంగా గ్రహిస్తాడు. శిక్ష ముగిసి ఇంటికి తిరిగివచ్చిన వెంకటికి సత్తి మరణించిందనే ఘోరమైన నిజం తెలుస్తుంది. తన గైర్హాజరీలో కామాంధుడైన నాయుడు ఆమెను బలాత్కరించి చంపేశాడని తెలుసుకున్న వెంకటి, ఆ వేదన నుండి పుట్టిన పగతో నాయుడిని అంతం చేయడంతో కథ ముగుస్తుంది. అల్పాక్షరాలలో అనల్పార్థం వచ్చేలా, ఒక సామాన్యుడి జీవితంలోని విషాదాన్ని, దోపిడీ వ్యవస్థలోని క్రూరత్వాన్ని రచయిత ఇందులో అత్యంత శక్తివంతంగా చిత్రించారు.

భూషణం గారి 'పద్మవ్యూహం' కథలో పేదవాడి అమాయకత్వం, పెట్టుబడిదారీ వ్యవస్థలోని క్రూరత్వం ఎంత భయంకరంగా ఉంటాయో రచయిత కళ్లకు కట్టారు. తన గర్భిణి భార్య సత్తికి ఒక కోక (చీర) కొనాలనే కనీస అవసరం కోసం, వెంకటి నాయుడు అనే భూస్వామి పన్నే కుట్రలో చిక్కుకుంటాడు. సారా బస్తాలు రవాణా



చేస్తూ పట్టుబడిన వెంకటిని పోలీసులు చితకబాదుతున్నా, యజమాని నాయుడిపై ఉన్న నమ్మకంతో నిజాన్ని దాచడానికి ప్రయత్నిస్తాడు. కానీ, అసలు నిజం వేరు. పోలీసులకు నెలకు కొన్ని కేసులు చూపించాలనే నిబంధన ప్రకారం, నాయుడే తన స్వలాభం కోసం అమాయకుడైన వెంకటిని పోలీసులకు పట్టించి, 'బోనులో ఎలకను చూసి నవ్వినట్టు' నవ్వుతాడు. జైలు గోడల మధ్య వెంకటికి తెలిసిన చేదు నిజం ఏమిటంటే-ధనవంతులు, పోలీసులు కలిసి ఆడుతున్న ఈ విషవలయంలో తానొక బలిపశువు మాత్రమేనని. మూడు నెలల జైలు శిక్ష తర్వాత విడుదలైన వెంకటికి ఎదురైన భయంకరమైన వార్త అతడి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. తన భార్య సత్తికి పురుడు పోస్తానని, తోడుగా ఉంటానని నమ్మబలికిన నాయుడే, ఆమె నిండు చూలాలని కూడా చూడకుండా బలాత్కారం చేసి చంపేస్తాడు. సత్తి శవంపై ఉన్న గాయాలు నాయుడిలోని కామాంధుడిని, రాక్షసత్వాన్ని బయటపెడతాయి. చివరకు, తన జీవితాన్ని నాశనం చేసిన ఆ 'నాగుపాము' కళ్ల నాయుడిపై వెంకటి పగ తీర్చుకోవడంతో కథ ముగుస్తుంది. నిరుపేదలు తమ కనీస అవసరాల కోసం అడుగు వేస్తే, సమాజంలోని పెద్దమనుషులు వారిని ఎలా 'పద్మవ్యూహం'లోకి లాగి ప్రాణాలు తీస్తారో ఈ కథ అత్యంత శక్తివంతంగా, నిక్కచ్చిగా వివరిస్తుంది.


**భూషణం గారి 'పద్మవ్యూహం' కథ 1960ల నాటి సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తూ, పేదరికంలోని నిస్సహాయతను, పెట్టుబడిదారీ వ్యవస్థలోని క్రూరత్వాన్ని ఎండగట్టింది. భార్య కోరిక తీర్చడం కోసం చీకటిలో ప్రయాణం మొదలుపెట్టిన వెంకటి, తెలియకుండానే నాయుడు పన్నిన కుట్ర అనే పద్మవ్యూహంలో చిక్కుకుంటాడు. రచయిత వాడిన 'చీకటి' అనే ప్రతీక వెంకటి అంధకార భవిష్యత్తుకు సూచికగా నిలుస్తుంది. నాయుడు అనే పెత్తందారు తన స్వార్థం కోసం వెంకటిని బలిపశువును చేయడమే కాకుండా, అతని గైర్హాజరీలో సత్తిని బలాత్కరించి ప్రాణాలు తీయడం సమాజంలోని అణచివేతకు పరాకాష్ట. మహాభారతంలోని అభిమన్యుడిలాగే, వెంకటి కూడా ఈ సామాజిక ఆర్థిక పద్మవ్యూహంలోకి ప్రవేశించి తిరిగి రాలేకపోతాడు.**

కథ ముగింపులో 'అమ్మా!' అనే అరుపు మరియు నాయుడి కళ్లు 'నాగుపాము కళ్లలా' మెరవడం వెనుక రచయిత ఒక చేదు నిజాన్ని దాచారు. విషపూరితమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు సామాన్యుడి పోరాటం ఎంత బలహీనమైనదో ఇది సూచిస్తుంది. నాయుడు అనే పాము కోరల్లో చిక్కుకున్న ఎలుక లాంటి వెంకటి జీవితం ఆ చీకట్లోనే అస్తమిస్తుంది. కమ్యూనిస్ట్ భావజాలంతో, శ్రామిక వర్గాల పక్షాన నిలబడి భూషణం గారు రచించిన ఈ కథ, శ్రమ దోపిడీని మరియు అణగారిన వర్గాల వేదనను అత్యంత హృద్యంగా చిత్రించింది. మనిషిని సమాజమే మలుస్తుందన్న అరిస్టాటిల్ మాటలకు నిదర్శనంగా, ఈ కథలోని పాత్రలు నాటి గ్రామీణ జీవన చిత్రణను, దోపిడీని కళ్లకు కడతాయి.

కథను ఒక విషాదంతో ముగించడం ద్వారా పాఠకులలో ఒక సామాజిక స్పృహను, ఆలోచనను రేకెత్తించడంలో రచయిత సఫలమయ్యారు. "పద్మవ్యూహం" కథ కేవలం ఒక వ్యక్తి విషాద గాథ మాత్రమే కాదు. ఇది అట్టడుగు వర్గాల మీద జరుగుతున్న నిరంతర దోపిడీకి వ్యతిరేకంగా సంధించిన ఒక విమర్శనాత్మక అస్త్రం. సామాజిక చైతన్యాన్ని కోరుకునే ఏ సాహిత్య పరిశోధనలోనైనా ఈ కథకు విశిష్ట స్థానం ఉంటుంది. విశ్వమంతా వ్యాపించి ఉన్న విష్ణువు వామనుడిలా దాగినట్టు రచయిత భూషణం చెప్పదలచుకున్న విషయాన్ని నాలుగున్నర పేజీల్లోనే చెప్పి విజయం సాధించారు. 'కథ అనేది మొదట్లో కుతుహలాన్ని చివర ఆలోచనల్ని కల్గించాలి. మధ్యలో చెప్పేది రక్తి కట్టిస్తూ చెప్పుకుపోవాలన్నాడు. - ఆరుద్ర'. అలాంటి కథా లక్షణం ఉన్న కథే ఈ 'పద్మవ్యూహం' అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యాసను తీసుకోవడం వలన పాత్రల మనోభావాలను ప్రతిబింబించేలా సంభాషణలు నడిచాయి. రచయిత భూషణం సమాజంలోని వేళ్ళూనుకుని పోయిన రుగ్మతలను వేలెత్తి చూపించే ప్రయత్నం చేశారు. ఇటువంటి రచలపై పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.



మమత వేపాడ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్
(ఆంధ్రాయూనివర్సిటి), వాల్తేరు.



# మంగలి ఎంకటి మామ

ఎంకటి మామ కత్తెరే
ఊరందరికీ దిక్కు.
చిన్నప్పుడు మా ఇండ్లకు ఆన్కొని
మురికి కాలువ పక్కన మామ డబ్బ
గట్టిగ గాలిదుమారం అస్తె
కొట్టుకపోతున్నట్టుండేది
ఐనా అరడజన్ మందిని సాదింది ఆ డబ్బ.

నెలకోసారి నేనాడికి పోతే
మెడపొంటి తెల్లటి సిల్క్ బట్ట సుట్టి
బుషి పెరిగినట్టు పెరిగిన
ఎంటికలపై నీళ్లు జల్లి
తలను తబల చేసేవాడు.
రైతు నాగలితో భూమిని దున్నినట్టు
మామ మా ఎంటికలను
సాల్లలాగ సక్కగ దువ్వేది.

అప్పుడప్పుడు
నాన్న గడ్డానికి ఇంత పేస్ట్ రాసి
బుర్ష్ తో అటు ఇటు రుద్ది
చెంపలను
పాలరాతి కంటే నున్నగా మార్చేవాడు.

తలపై ఒంటి పాపడ దీసి
వేళ్ల మధ్య కత్తెరతో చేసే సప్పుడుకు
సంగీత సరిగమలు మదిలో మెదిలేది.
కటింగ్ చేస్తూ మధ్య మధ్యలో
కార్ గేర్లు ముందుకు వెనక్కి మార్చినట్టు
మా మెడల్ని అటు ఇటు మార్చేవాడు.

పండ్లదువ్వెనతో మెల్లగా ఎంటికలు
దువ్వుతూ
ఆయన మాటలతో మా మనస్సును
దువ్వేవాడు.
నాన్న చెప్పినట్టు విని
ఆర్మి కటింగ్ అని గుండుగొర్గి
మమ్మల్ని ఆర్తనాదాలు పెట్టించేవాడు.

కత్తెర పని అయిపోయినంక
కత్తి పట్టుకొని చెవుల మీద చెయేస్తే
సూర్పనక చెవుల్లా కోసి పంపిస్తాడనుకొని
భయంతో వన్కి పోయేవాళ్ళం.

ఆయన ముందు మేం
కుక్క కూనల్లా కాసేపు ముడుచుకు కూసొని
ఒంటిపై సిల్క్ బట్ట తీయగానే
పంజరం తెరిచిన పక్షిలా
పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళేవాళ్ళం.



- గిన్నారపు ఆదినారాయణ
కవి, రచయిత,
భారతీయ భాష సమ్మాన్ యువ పురస్కార గ్రహీత,
9949532456